VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers


# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 130

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శనివారం 17 అక్టోబర్ 2026


## కనకదుర్గమ్మకు సీఎం చంద్రబాబు దంపతులు చీర, సారె సమర్పణ

● ప్రజలంతా సంతోషంగా ఉండాలని అమ్మవారికి ప్రార్థన ● రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన సీఎం ● పట్టు వస్త్రాల సమర్పణ సమయంలోనూ సాగిన సామాన్యుల దర్శనాలు









**విజయవాడ,కలంకౌంటర్ :** ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీసమేతంగా దర్శించుకున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు సీఎం తెలిపారు. దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ ముఖ్యమంత్రికి పరివేష్టం అలంకరించారు. అనంతరం సీఎం పట్టువస్త్రాలు, సారెను అమ్మవారికి సమర్పించారు . పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారి అంతరాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీఎం పట్టువస్త్రాలు సమర్పించే సమయంలోనూ సామాన్య భక్తుల దర్శనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా క్యూ లైన్లను కొనసాగించారు. పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు సీఎం దంపతులకు వేదాశీస్సులు అందజేశారు. ఈవో శీనానాయక్ అమ్మవారి శేషవస్త్రాలను అందించగా, ఆలయ చైర్మన్, ఈవో అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

**6 రోజుల్లో 8 లక్షల మంది భక్తుల దర్శనం..** ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... 'రాష్ట్ర ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు. ప్రభుత్వం తరఫున కుటుంబ సమేతంగా అమ్మవారికి చీర, సారె సమర్పించి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించాను. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పాలక మండలి, అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఆరు రోజుల్లోనే ఎనిమిది లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భక్తిశ్రద్ధలతో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. విజయవాడ ఉత్సవ్ 2.0, జాతీయ సరస్ మేళా కూడా ఇక్కడే జరుగుతున్నాయి. దేశంలో ప్రముఖంగా నిర్వహించే ఉత్సవాల్లో విజయవాడ దసరా ఉత్సవాలు చోటు సంపాదించుకోవడం శుభపరిణామం. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించాను. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఆకాంక్షించాను. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజంగా తీర్చిదిద్దాలని అమ్మవారిని కోరుకున్నాను' అని సీఎం చంద్రబాబు అన్నారు.

## జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్

● పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జనసేన ప్రచార రథం ప్రారంభం ● 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్'ను జెండా ఊపి ప్రారంభించిన పవన్ కల్యాణ్ ● అభ్యర్థి గడల శ్రీనివాసరావు గెలుపునకు పలు సూచనలు ● యువత సమస్యలు తెలుసుకునే వేదికగా ఉండాలని పిలుపు





**విజయవాడ, కలంకౌంటర్ :** ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి జనసేన సిద్ధమైంది. ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాదులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ గడల శ్రీనివాసరావుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రచారానికి సంబంధించి ఆయనకు పలు సూచనలు చేశారు. ఈ 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' కేవలం ఎన్నికల ప్రచార వాహనంగానే పరిమితం కాకూడదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేసే ఒక ప్రజాసేవా వేదికగా ఇది కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాదులోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

## 28 మంది ఐఎఫ్ఎస్ అధికారులను వ్యయ పరిశీలకులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషన్

● రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించిన వ్యయానికి మించి అభ్యర్థి ఖర్చు చేయరాదు: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

**విజయవాడ,కలంకౌంటర్ :** రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటన ద్వారా నిర్ణయించిన వ్యయానికి మించి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఖర్చు చేయరాదని అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. 28 జిల్లాలకు వ్యయ పరిశీలకులను నియమిస్తూ పలువురు ఐఎఫ్ఎస్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసిన ఎన్నికల కమిషనర్ పునేఠా శుక్రవారం నాడు వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ చేసే అభ్యర్థి నామినేషన్ వేసినప్పటి నుండి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అభ్యర్థి రోజు రోజువారీ ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా సదరు అభ్యర్థికి ఎన్నికల వ్యయాన్ని నమోదు చేయడానికి కావాల్సిన నిర్దిష్ట నమూనాలను ఉచితంగా నిర్ణీత సమయంలో రిటర్నింగు అధికారి అందజేసేలా రిటర్నింగు అధికారులకు మార్గనిర్దేశం చేయాలని కోరారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 45 రోజుల లోపల పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తన మొత్తం ఎన్నికల ఖర్చు వివరాలను జిల్లా ఎన్నికల అధికారికి తప్పక సమర్పించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల నిర్వహణ తీరుకు సంబంధించి అభ్యర్థులకు, వారి ఏజెంట్లకు, సామాన్య ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని వ్యయ పరిశీలకులకు ఎన్నికల కమిషనర్ పునేఠా ఆదేశించారు. రాజకీయ ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించకుండా పరిశీలకులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే ఘటనలపై అప్రమత్తంగా ఉంటూ, నిబంధనల అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో పోలింగు ముగిసే 48 గంటల నుండి, పంచాయతీలలో పోలింగ్ ముగిసే 44 గంటల ముందు నుండి మద్యం సరఫరా నిలుపుదల చేయాలని, పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అక్రమ మద్యం సరఫరా, అమ్మకాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

## విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్.. నారా భువనేశ్వరికి చంద్రబాబు అభినందనలు

● విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ రక్త నిధి కేంద్రం ఏర్పాటును అభినందించిన సీఎం చంద్రబాబు ● సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి బృందానికి ప్రత్యేక అభినందనలు ● తలసేమియా చిన్నారులకు ఉచిత రక్తం అందించడం గొప్ప మానవీయ సేవ అని కొనియాడారు ● విద్యా, వైద్య రంగాల్లో ట్రస్ట్ అందిస్తున్న సేవలను ప్రస్తావించిన ముఖ్యమంత్రి ● ప్రాణ రక్షణే లక్ష్యంగా ట్రస్ట్ ముందుకు సాగాలని ఆకాంక్ష




**విజయవాడ, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలపై ప్రశంసల వర్షం కురిపించారు. విజయవాడలో కొత్తగా ఎన్టీఆర్ ట్రస్ట్ రక్త నిధి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో, ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రక్తం అందక ఏ ఒక్క ప్రాణమూ ప్రమాదంలో పడకూడదనే గొప్ప సంకల్పంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన అర్ధాంగి, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి, ఆమె బృందానికి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. "ఒక్కరి రక్తదానం ఆపదలో ఉన్న మరో కుటుంబానికి జీవన ప్రదాత అవుతుంది. ప్రాణాపాయంలో ఉన్నవారికి పునర్జన్మనిస్తుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా రక్తం అందించాలనే నిర్ణయం గొప్ప మానవీయ సేవ అని ఆయన కొనియాడారు. కేవలం బ్లడ్ బ్యాంక్ మాత్రమే కాకుండా, విద్యా, వైద్యం, మహిళా సాధికారత వంటి ఎన్నో రంగాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను చంద్రబాబు గుర్తుచేశారు. 'సంజీవని మొబైల్ క్లినిక్స్' ద్వారా మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలు చేరవేయడం స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ప్రతి సేవలో మానవత్వం, ప్రతి ప్రయత్నంలో ప్రాణ రక్షణే లక్ష్యంగా ఎన్టీఆర్ ట్రస్ట్ తన సేవలను మరింతగా విస్తరించి, ఎంతో మందికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## వైసీపీ గుండాగిరిని సహించం

● ఎంపీగా ఉండి నామినేషన్లను అడ్డుకుంటారా? ● గత పాలనలోని గుండాగిరిని ఇప్పుడూ కొనసాగించాలనుకుంటున్నారా? ● కార్యకర్తలను కారుతో ఢీకొడతారా.. ప్రాణాలతో చెలగాటమా? ● మహిళలపై దాడులు.. పోలీసులపైనా దౌర్జన్యాలా? ● భూమన, మిథున్‌రెడ్డిపై సమగ్ర విచారణ జరగాలి ● పుంగనూరు, తిరుపతి ఘటనలపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆగ్రహం



**అమరావతి,కలంకౌంటర్ :** పుంగనూరు, తిరుపతిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, కూటమి అభ్యర్థుల నామినేషన్ల అడ్డగింతకు సంబంధించిన ఘటనలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ శ్రేణుల చేసిన దాడులను ప్రస్తావిస్తూ, ప్రజాస్వామ్య ప్రక్రియను గుండాగిరితో అడ్డుకోవాలనుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. అభ్యర్థులపై దాడులు చేసి, నామినేషన్ పత్రాలు చించేసి ప్రజాతీర్పును మార్చగలమనుకుంటున్నారా అని ప్రశ్నించారు. మహిళలను గాయపరిచి, వాహనాలను ధ్వంసం చేయడమే వైసీపీ రాజకీయమా అని నిలదీశారు. పుంగనూరులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి తన అనుచరులతో కలిసి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారని, కారుతో ఢీకొట్టి నామినేషన్ల కార్యక్రమాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడంపై మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఎంపీగా ఉండి ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన వ్యక్తి నామినేషన్లనే అడ్డుకుంటారా? గత ప్రభుత్వ హయాంలో సాగించిన గుండాగిరినే ఇప్పుడూ చలామణి చేయాలని చూస్తున్నారా? కారుతో కార్యకర్తలను ఢీకొట్టడం, నాయకులపై దాడులకు దిగడం రాజకీయమా? ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే దౌర్జన్యాలను సహించేది లేదు అని హెచ్చరించారు. మిథున్‌రెడ్డి కాన్వాయ్‌తో వచ్చిన వ్యక్తులు మద్యం మత్తులో, దాడి చేయాలనే ఉద్దేశంతోనే ప్రాంగణంలోకి ప్రవేశించారని మంత్రి తెలిపారు. టీడీపీ నేత మధురాయల్, అభ్యర్థులు, పోలీసులపై దాడులు, వాహనాల ధ్వంసానికి సంబంధించిన సమాచారాన్ని తీవ్రంగా ఖండించారు. పోలీసులపైనే దాడులకు తెగబడితే చట్టమంటే లెక్కలేదా? దాడులకు పాల్పడిన వారితోపాటు వాటిని ప్రోత్సహించిన వారూ చట్టానికి సమాధానం చెప్పాల్సిందే అని స్పష్టం చేశారు. మిథున్‌రెడ్డి ప్రమేయంపై వచ్చిన ఆరోపణలు సహా అన్ని అంశాలపై ఆధారాలను పరిశీలించి సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌లో కూటమి అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకోవడం, యువత, మహిళలపై దాడులు జరగడం, పలువురు టీడీపీ కార్యకర్తలు గాయపడినట్లు వచ్చిన వివరాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కెనడీనగర్‌లో నామినేషన్ వేసేందుకు వెళ్తున్న టీడీపీ కార్యకర్త యశోదపై భూమన అనుచరులు దాడి చేసి, పత్రాలు చించేసిన ఘటనను తీవ్రంగా ఖండించారు. ఒక మహిళ ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందుకొస్తే దాడి చేస్తారా? ఆమె చేతిలోని పత్రాలు చించేయడం ద్వారా మీ రాజకీయ బలహీనతనే బయటపెట్టుకున్నారు. మహిళలపై దాడులు చేసే వారికి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు ఎక్కడిది? అని ధ్వజమెత్తారు. దాడులను బహిరంగంగా ఖండించి, నిష్పక్షపాత విచారణకు సహకరించాల్సిన బాధ్యత వైసీపీ నాయకత్వంపై ఉందన్నారు.

# టీడీపీని వీడి వైసీపీ లో చేరిన గిద్దలూరు పట్టణ నాయకులు





**మార్కాపురం,కలంకౌంటర్ :** గిద్దలూరు పట్టణం 18 వార్డ్ నుంచి మానం ప్రభాకర్ రెడ్డి ,19 వ వార్డ్ నుండి బల్లని రాంబాబు,24వ వార్డ్ నుండి చింతలపూడి బాల రాజు,26 వ వార్డ్ నుండి షేక్ హారోన్ రషీద్ , 8వ వార్డుకు చెందిన పల్లె పుల్లారెడ్డి, మరియు పలువురు నాయకులు టిడిపిని వీడి గిద్దలూరు ఇంచార్జ్ కె. పి. నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి లో చేరారు.

# బిజెపి రాష్ట్ర సాంస్కృతిక విభాగ సభ్యుడిగా దర్శకుడు డా. పి.సి. ఆదిత్య



**కావలి,కలంకౌంటర్ :** భారతీయ జనతా పార్టీ (బిజెపి) తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక విభాగం సభ్యుడిగా ప్రముఖ సినీ దర్శకుడు, రచయిత, నటుడు డాక్టర్ పి.సి. ఆదిత్య నియమితులయ్యారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ఆదేశాల మేరకు, సాంస్కృతిక విభాగం కన్వీనర్ రాజమౌళి గౌడ్, కో-కన్వీనర్ శ్రీనివాసరాజ్ సంయుక్తంగా ఈ నియామక పత్రాన్ని జారీ చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు నియామక పత్రాన్ని పి.సి. ఆదిత్యకు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా సినీ రంగంలో నిత్య ప్రయోగశీలిగా రాణిస్తూ,ఎందరో నూతన కళాకారులను వెండితెరకు పరిచయం చేసిన పి.సి. ఆదిత్య సేవలను పార్టీ గుర్తించిందని పేర్కొన్నారు. తన నియామకం పట్ల డాక్టర్ పి.సి. ఆదిత్య హర్షం వ్యక్తం చేస్తూ.. రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు, సాంస్కృతిక విభాగం కన్వీనర్ రాజమౌళి గౌడ్, కో-కన్వీనర్ శ్రీనివాసరాజులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు,కావలి నుండి డా.పాదర్తి నాగరాజు, అభిమానులు, మిత్రులు ఆదిత్యకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# బృందావనం కాలనీలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు



**కావలి,కలంకౌంటర్ :** స్థానిక బృందావనం హౌసింగ్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగాజరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు స్వామివారు విశేషమైన 'మోహినీ రూపం'లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు స్వామివారిని సుగంధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి, శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు.క్షీరసాగర మథనం సమయంలో అమృతాన్ని పంచడానికి శ్రీమహావిష్ణువు ధరించిన మోహినీ స్వరూపాన్ని భక్తులు దర్శించుకుని పులకించిపోయారు.

# వైభవంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు





**బంటుమిల్లి,కలంకౌంటర్ :** మండలంలో వైభవంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతున్నాయి. బంటుమిల్లి , పెద్ద తుమ్మిడి, అర్థమూరు ముంజులూరు ఆముదాలపల్లి తదితర గ్రామాలలోనీ దేవాలయాలలో అమ్మవార్లను నవరాత్రి మహోత్సవాల సందర్భంగా పలు అవతారాలు వేసి అమ్మవార్లకు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నవరాత్రి మహోత్సవంలో బంటుమిల్లి గ్రామంలోని శ్రీ కనకదుర్గ దేవస్థానంలో అమ్మవారు ఆరవ రోజు అయిన శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా రాత్రి ఏడు గంటలకు చిన్నారులచే సరస్వతీ పూజలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బంటుమిల్లి సీతారామస్వామి దేవాలయంలో అమ్మవారు మూల నక్షత్రం సందర్భంగా విద్యాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు ఉదయం సీతారామస్వామి దేవాలయంలో అమ్మవారు విద్యాలక్ష్మి అవతారం అవతారంలో దర్శనమిచ్చారు.మూలా నక్షత్రం సందర్భంగా చిన్నారులచే సరస్వతీ పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

# వైఎస్సార్‌సీపీకి మరో షాక్-గుడ్‌బై చెప్పిన సన్నపురెడ్డి బ్రదర్స్







**నెల్లూరు,కలంకౌంటర్ :** వైఎస్ఆర్సీపీకి ఆ పార్టీ నేతలు షాక్ ల మీద షాకులిస్తున్నారు.అభివృద్ధి కే మా మద్దతు అంటూ అధికార టీడీపీ వైపు అడుగులు వేస్తున్నారు.రోజుకో డివిజన్ లో కండువాలు మారుస్తూ వలస బాట పడుతున్నారు.సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సన్నపురెడ్డి సోదరులు వైఎస్ఆర్సీపీ అగ్రనేతల ఒంటెద్దు పోకడలు నచ్చక ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. సన్నపురెడ్డి ఆఫీస్ కి వెళ్లి మంత్రి నారాయణ,ఎంఎల్ఏ శ్రీధర్ రెడ్డిలు ఆహ్వానించటంతో సోదరులు,వారి సహచరులు రేపు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకోబోతున్నారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ పెంచలరెడ్డి , సుబ్బారెడ్డి ,శ్రీనివాస్ ముగ్గురూ వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరడానికి నిర్ణయించుకోవటం శుభ పరిణామమన్నారు.రూరల్ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ సన్నపురెడ్డి పెంచలరెడ్డి , వారి సోదరుడు సుబ్బారెడ్డి నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో మంచి పలుకుబడి ఉన్న నేతలని. వీరితో పాటు మంచికంటి శ్రీనివాసులు కూడా వైసీపీకి రాజీనామా చేసి, మంత్రి నారాయణ గారి ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతుండటం సంతోషకరం అన్నారు. సన్నపురెడ్డి సోదరులు ఏ పార్టీలో ఉన్నా నిబద్ధతతో, అంకితభావంతో కష్టపడి పనిచేస్తారన్నారు. రేపు వారు అధికారికంగా పార్టీలో చేరుతారన్నారు.సన్నపు రెడ్డి పెంచలరెడ్డి మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తూ ప్రజల్లో మమేకమైన తమను విస్మరించడం వల్లనే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు.కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తామన్నారు. వైసీపీకి చెందిన ప్రముఖ నేతలు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, సన్నపురెడ్డి సుబ్బారెడ్డి, మంచికంటి శ్రీనివాసులు తెలుగుదేశం పార్టీలో చేరాలని నిర్ణయించుకోవడం మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.అసలే అంతంత మాత్రంగా ఉన్న వైసికి తీవ్ర నష్టం చేకూరుస్తుందంటున్నారు. మంత్రి,ఎంఎల్ఏ లతో పాటు రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్,టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నారాయణ విద్యాసమస్థల జీఎం వేమిరెడ్డి విజయ్ భాస్కర్ రెడ్డి, స్వయంగా సన్నపురెడ్డి సోదరుల ఆఫీస్‌కు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారిని సాదరంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు.

# శిద్దా సుధీర్ కు శుభాకాంక్షలు తెలిపిన ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం



**ఒంగోలు,కలంకౌంటర్ :** ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు కనమర్లపూడి హరిప్రసాదరావు ఆధ్వర్యంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తనయుడు సుధీర్ కుమార్ కు అందజేసి, ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ కొండవీటి వడ్డీకాసులు, జిల్లా ట్రెజరర్ మొదడుగు వెంకటేశ్వర్లు, రాష్ట్ర యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చందోలు మణికంఠ, ప్రకాశం జిల్లా యువజన సంఘం అధ్యక్షులు శిగాకొల్లి సత్యనారాయణ, ఆర్యవైశ్య నాయకులు కనమల్లపూడి మురళి, ముక్కాల మయూరినాథ్, వేటపాలెం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పార్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చిన శ్రీ వాసవి దేవి



**కందుకూరు, కలంకౌంటర్ :** కందుకూరు పొట్టి శ్రీరాములు బజారు నందు ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రుల ఆలయ ప్రెసిడెంట్ కోట వెంకట నరసింహ ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆరవ రోజు శుక్రవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు భక్తులకు పార్వతీదేవి రూపంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు రాజా స్వామి ఆధ్వర్యంలో అమ్మవారిని కన్నుల పండుగ అలంకరించి ప్రత్యేక పూజలు, అమ్మవారి మూల మంత్ర హోమం నిర్వహించారు. నగరేశ్వర స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. బొగ్గవరపు వెంకట సత్యనారాయణ ధర్మపత్ని ధాత్రి సత్య ఉభయ దాతలుగా వ్యవహరించారు. మహిళా భక్తులు లలితా సహస్రనామ పారాయణం ఆలపించారు. సాయంత్రం పలుకూరు భజన బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం, తదుపరి గుడి ఉత్సవం నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అన్నప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# స్థానిక అభ్యర్థుల ఎంపికపై మొదలైన కసరత్తు

- ఉలవపాడులో కూటమి నేతలతో ఎమ్మెల్యే ఇంటూరి సమావేశం
- జడ్పిటిసి, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాల్లో సత్తా చాటాలని పిలుపు



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల సందడి మొదలైంది. జడ్పిటిసి, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కసరత్తు ప్రారంభించారు. అందులో భాగంగా, ఉలవపాడు మండలంలోని తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీల ముఖ్య నేతలతో... ఉలవపాడులో ఎమ్మెల్యే నాగేశ్వరరావు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముందుగా అభ్యర్థుల ఎంపికపై, స్థానిక నేతల అభిప్రాయాలు తీసుకున్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరావు మాట్లాడుతూ.... ఈనెల 21 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. గెలుపే లక్ష్యంగా, స్థానికుల అభిప్రాయాలతోనే అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. మూడు పార్టీల నాయకులు పరస్పరం సహకరించుకుంటూ, ప్రతి స్థానాన్ని గెలుచుకునేలా కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరావు , ఎంపీటీసీ స్థానాల వారీగా నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా పలువురు ఆశావహులు ఎమ్మెల్యే ని కలిసి తమకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీనియారిటీ, కష్టపడే తత్వంతో పాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తులనే అభ్యర్థులుగా ఎంపిక చేస్తామని ఎమ్మెల్యే తెలియజేశారు. కందుకూరు, ఉలవపాడు, లింగసముద్రం, గుడ్లూరు కొంతమంది వైసీపీకి గుడ్ బై చెప్పి ఎమ్మెల్యే సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సమావేశంలో మండల టిడిపి అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సుదర్శి శ్రీనివాసులు, మండల జనసేన అధ్యక్షుడు అయ్యప్ప, మండల బిజెపి అధ్యక్షుడు రాంబాబు, టీడీపీ క్లస్టర్ ఇన్చార్జిలు పోలుబోయిన శ్రీనివాసులు, బెల్లం కృష్ణమోహన్, ఏఎంసీ డైరెక్టర్ అమ్మనబ్రోలు మాధవ, నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మద్దసాని మహేంద్ర, అన్ని గ్రామాల నేతలు హాజరయ్యారు.



## మున్సిపల్ చైర్ పర్సన్ గా ఉడత్తుసురేష్ వైసీపీ అభ్యర్థి గా ప్రకటించారు.

-అద్దంకి,కలంకౌంటర్ :

## బద్వేల్ వైసిపి పార్టీ చైర్మన్ అభ్యర్థిగా రాచపూడి సాయికృష్ణ

- ఆర్యవైశ్యుల కు దక్కిన గౌరవం అంటూ హర్షం వ్యక్తం



**బద్వేల్,కలంకౌంటర్ :** బద్వేల్ వైయస్సార్సీపి పార్టీలో ఆర్యవైశ్యులకు అరుదైన గౌరవం దక్కిందని మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి రాచపూడి సాయి కృష్ణ హర్షం వ్యక్తం చేశారు.



## వైసీపీ మేయర్ అభ్యర్థి గా ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్ ను ప్రకటించిన అధిష్టానం

-ఒంగోలు,కలంకౌంటర్ :

# అభిమానుల కోలాహలం నడుమ ఘనంగా శిద్దా సుధీర్ కుమార్ జన్మదిన వేడుకలు

-శుభాకాంక్షలతో తెలపడానికి పెద్ద ఎత్తున తరలి వచ్చిన అభిమానులు.ప్రముఖులు







**ఒంగోలు,కలంకౌంటర్ :** పారిశ్రామిక వేత్త, చాంబర్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ సెంట్రల్ జోన్ ఉపాధ్యక్షులు మాజీమంత్రి శిద్దా రాఘవరావు తనయులు శిద్దా సుధీర్ కుమార్ జన్మదిన వేడుకలు ఒంగోలు లోని వారి నివాసంలో,చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో అభిమానుల కోలాహలం నడుమ హొట్ట హసంగా జరిగాయి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపడానికి అభిమానులు యువత,వ్యాపార వర్గాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతుల సమక్షంలో ఒంగోలు లోని వారి నివాసంలో తమ గ్రూప్ ఆఫ్ గ్రానైట్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేకును శిద్దా సుధీర్ కుమార్ దంపతులు కుటుంబ సభ్యులతో కలసి కట్ చేశారు.తొలుత శిద్దా రాఘవరావు దంపతులు శిద్దా సుధీర్ కుమార్ కు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం అభిమానుల ఆధ్వర్యంలో భారీ గజమాలతో శిద్దా సుధీర్ కుమార్ దంపతులు శిద్దా రాఘవరావు దంపతులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కనమర్ల పూడి హరి ప్రసాద రావు ఆధ్వర్యంలో నూతన కమిటి సభ్యులు,మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావు, కోట హనుమంతరావు, ఇంటర్ నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ నాయకులు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు జలదంకి కృష్ణారావు,పెనుగొండ శ్రీనివాస రావు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య నాయకులు భారీ కేక్ మరియు గజ మాలతో శిద్దా సుధీర్ కుమార్ దంపతులను, శిద్దా రాఘవరావు దంపతులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలు,చీమకుర్తి, దర్శి,మార్కాపురం, పొదిలి,ప్రాంతాలకు చెందిన ప్రముఖులు ఆర్యవైశ్య సంఘం నాయకులు,ఆర్యవైశ్య మహిళలు శిద్దా సుధీర్ కుమార్ కు శుభాకాంక్షలు తెలియచేశారు. చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో వైభవంగా సుధీర్ కుమార్ జన్మదిన వేడుకలు జరిగాయి.అనంతరం గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ ఏ.గిరి బాబు ఆధ్వర్యంలో మరియు జ్యోతి గ్రానైట్ సి.ఓ.ఓ.ఎమ్ శివ రామ్ మరియు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మురారి శెట్టి సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో శిద్దా సుధీర్ కుమార్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో శిద్దా అభిమానులు పాల్గొన్నారు.

# భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

## -ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



**ఇంద్రకీలాద్రికలంకౌంటర్ :** విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మవారిని శుక్రవారం దర్శించుకున్నారు. మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విద్యా విజ్ఞానం కలగాలని ఆకాంక్షించారు. దర్శనం అనంతరం ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై చేపట్టిన ఏర్పాట్లు మంచి ఫలితాలు ఇస్తున్నాయి అన్నారు. భక్తులకు ఎక్కడైనా ఇబ్బంది ఎదురైతే గుర్తించి, వెంటనే పరిష్కరించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా భక్తుల రద్దీని పర్యవేక్షించడంతోపాటు, సమస్యలు తలెత్తినప్పుడు వేగంగా స్పందించే అవకాశం ఉంటుందని తెలిపారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. రద్దీ నియంత్రణ, భద్రత, క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని వెల్లడించారు. భక్తుల సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఉత్సవాల నిర్వహణ కొనసాగుతుందన్నారు.

# అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలి

## -రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి





**ఇంద్రకీలాద్రి,కలంకౌంటర్ :** అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి సంతృప్తికరమైన దర్శనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శుక్రవారం అమ్మవారి దర్శనం అనంతరం ఇంద్రకీలాద్రి మీడియా పాయింట్ వద్ద మంత్రి తొలుత ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

**భక్తులకు ఇబ్బందులు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు..** గతంలో మూలా నక్షత్రం రోజున శ్రీ కనకదుర్గమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చేవారని, క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉండటంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని మంత్రి గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, దర్శన ప్రక్రియను మరింత సులభతరం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ ఏడాది దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో దసరా మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులు సైతం ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా, ప్రశాంతంగా, తృప్తిగా దర్శనం చేసుకుని తమ ఇళ్లకు తిరిగి వెళ్లాలన్న సత్సంకల్పంతో ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

**అమ్మవారి కృపతో రాష్ట్రంలో సిరిసంపదలు వెల్లివిరియాలి..** దసరా పర్వదినం సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతుల కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరియాలని మంత్రి ఆకాంక్షించారు. యువతీ యువకులకు మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించి, వారి భవిష్యత్తు ఉజ్వలంగా మారాలని కోరుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపడుతున్న కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని, రాష్ట్ర ప్రగతికి ఎటువంటి విఘ్నాలు ఎదురుకాకుండా అమ్మవారి అనుగ్రహం ఉండాలని ప్రార్థించారు.

**రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న నాయకులకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలి..** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతం కావాలని మంత్రి ఆకాంక్షించారు. అదేవిధంగా దేశాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. రాష్ట్రం, దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించడంతో పాటు ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

**విలేకరుల కుటుంబాల్లోనూ సుఖసంతోషాలు వెల్లివిరియాలి..** ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న విలేకరుల సోదరులకు మంత్రి కొలుసు పార్థసారథి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. విలేకరులందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని, వారు ఎదుర్కొంటున్న కష్టాలు తొలగిపోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యాలు నెలకొనాలని అయన తెలిపారు.

# మూలా నక్షత్ర పర్వదినాన జగన్మాత సన్నిధిలో విద్యా-కళా వైభవం

● ఆధ్యాత్మిక శోభతో పులకించిన కళావేదిక ● కొండపై వీణాపాణియై శ్రీ సరస్వతీ దేవిగా చదువులతల్లి దర్శనం ● కొండదిగువన నాదోపాసనతో మార్మోగిన కళా ప్రాంగణం. ● అక్షరజ్ఞాన ప్రదాత సన్నిధిలో కళార్చన ● భక్తితన్మయత్వంలో మునిగితేలిన లక్షలాది భక్తజనం









**ఇంద్రకీలాద్రి,కలంకౌంటర్ :** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో అత్యంత విశేషమైన మూలా నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ కనకదుర్గా నగర్‌లోని కళావేదికపై శుక్రవారం సాంస్కృతిక, ఆధ్యాత్మిక శోభ పరిపూర్ణంగా వికసించింది. శ్రీ కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రమైన పవిత్ర మూలా నక్షత్రం వేళ, జగజ్జనని ఇంద్రకీలాద్రి శిఖరాన శ్వేతవస్త్రధారిణియై, చేతిలో వీణ, పుస్తకం, జపమాల ధరించి సమస్త సృష్టికి జ్ఞానాన్ని, విద్యాబుద్ధులను ప్రసాదించే శ్రీ సరస్వతీ దేవి దివ్యాలంకారంలో భక్తులకు కటాక్షం ప్రసాదిస్తున్నారు. "సంగీతమపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయం" అన్నట్లుగా.. సాక్షాత్తు చదువుల తల్లికి, కళల అధిదేవతకు అంకితమిస్తూ కళాకారులు సమర్పించిన సంగీత, సాహిత్య, నాట్య నివేదనలు ప్రాంగణమంతటా భక్తి చైతన్యాన్ని రగిలించాయి. ఉదయం నుండి రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగిన ఈ దివ్య కళార్చనలు, దర్శనం కోసం బారులు తీరిన లక్షలాది మంది భక్తులను ఆధ్యాత్మిక ఆనందడోలికల్లో ఓలలాడించాయి.

**ఆధ్యాత్మిక నాదోపాసన -- కళాకారుల వివరాలు:** బి. సింధు బృందం సమర్పించిన సాంప్రదాయ తాళ భజనతో కళావేదిక ఆధ్యాత్మిక వైభవంతో ప్రారంభమైంది. వాగ్దేవిని, జగన్మాతను కీర్తిస్తూ ఎన్. రిషిత, ఎం. లక్ష్మీ శ్యామల, నిర్మల ఉ పద్మ ఆలపించిన భక్తిరంజని సంకీర్తనలు, దేవీ స్తోత్రాలు భక్తులను నాదబ్రహ్మంలో ఓలలాడించాయి. హరికథా భాగవతారిణి పి. లలిత సమర్పించిన హరికథ భక్తులను విశేషంగా రంజింపజేసింది. జ్ఞానప్రదాయిని అయిన సరస్వతీ దేవి మహిమలను, పురాణ గాథలను సుమధుర గానం, అభినయంతో రంగరించి వివరించిన తీరు భక్తుల ప్రశంసలు అందుకుంది.

**శాస్త్రీయ నృత్యార్చన :** సరస్వతీ కటాక్షాన్ని ఆకాంక్షిస్తూ చిన్నారులు కళాకారులు లయాన్విత అడుగులు, భావయుక్త ముద్రలతో కూచిపూడి, భరతనాట్య రీతులలో అద్భుత నాట్య నివేదన సమర్పించారు. ఎస్. అక్షయ, పి. మంజుష, బి.వి.ఎన్. సౌమ్య, ఎం.వి.ఎల్. సత్యవాణి, వి. నివేదిత, ఎస్. విజయలక్ష్మి మణి భార్గవి, జి. సత్య ఆనందని, జి.ఎస్.ఎల్. నరసింహ శర్మ, జె. అంబిక, పద్మశ్రీ హేమంత్ సిహెచ్. పావని లత, వి. మౌనిక పట్నాయక్, బి. హరగోపాల్, త్రినాధాచారి, ఎస్. భార్గవి ఐ. దుర్గా శేషకుమారి, పి. సూర్య ప్రకాశరావు కళాబృందాలు ప్రదర్శించిన శారదా భుజంగ ప్రయాత స్తోత్ర నృత్యాలు, సరస్వతీ వందనాలు, శివ-శక్తి నృత్య రూపకాలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. చదువుల తల్లి సన్నిధిలో సాగిన ఈ కళా ప్రదర్శనలు క్యూలైన్లలో ఉన్న భక్తులకు శ్రమ తెలియకుండా ఆధ్యాత్మిక అనుభూతిని పంచాయి. అమ్మవారి జన్మనక్షత్ర వేళ కళల రూపంలో సాక్షాత్కరించి నాట్యార్చన, గానార్చన చేసిన కళాకారులందరినీ దేవస్థాన అధికారులు ప్రశంసించి, శ్రీ అమ్మవారి శేషవస్త్రాలు, పవిత్ర ప్రసాదాలు, ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. చిన్నారుల సందడితో కళావేదిక మార్మోగింది.



**శుక్రవారం శ్రీ సరస్వతి దేవి అలంకృత అమ్మవారిని దర్శించుకున్న దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు**

-ఇంద్రకీలాద్రి,కలంకౌంటర్ :

# శ్రీ మహా సరస్వతిగా దర్శనమిచ్చిన బగళాముఖి అమ్మవారు





**చందోలు (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** గ్రామంలో వేంచేసియున్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో వైభవముగా జరుగుతున్న శ్రీ శరత్కాల షోడశ యజ్ఞకార్యక్రమాలలో ఆరవరోజు శ్రీ సరస్వతిమహాదేవి గా శ్రీ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. అనేక ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అక్షరాభ్యాస కార్యక్రమాలు అమ్మవారి సన్నిధిలో జరుపుకున్నారు. వీరందరికీ పలకలు, బలపములు చాక్లెట్లు పంపిణీ చేశారు. పెద్ద పిల్లలకు నోటుబుక్కు పెద్ద బాలశిక్ష సరస్వతి స్తోత్రమాలిక పుస్తకములు పెన్ను పెన్సిల్ చాక్లెట్ ఇవన్నీ ఒక సెట్ గా దాదాపు 1500 మంది విద్యార్థులకుఅందించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన దాతగా తెల్లబాటి శ్రీనివాసరావు దంపతులు వ్యవహరించారు మూలా నక్షత్రం సందర్భంగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సతీమణి డాక్టర్ మేఘన అమ్మవారిని దర్శించి పసుపు కుంకుమల సమర్పించారు ఈరోజు అన్నదానము పూజా కార్యక్రమాలకు హోమములకుప్రధాన ఉభయ దాతలుగా గుంటూరుకు చెందిన జి డి సి ఎం ఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు వినీల దంపతులు ఈరోజు కార్యక్రమాలలో ప్రధాన భూమిక వహించారని వచ్చిన భక్తకోటికి అన్నదానము, రాత్రి ప్రసాదములు అల్పాహార వితరణ ఏర్పాట్లు చేశామని అనేకగ్రామాల నుండి మహిళా సంఘాలవారు భక్తులకు కావాల్సిన అన్నదానం,ప్రసాదం, మంచినీరు దర్శనం వంటి ఏర్పాట్లు చూసారని దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కలకోట చక్రధర్ రెడ్డి ఈవో ఈ నరసింహమూర్తి తెలియ పరిచారు

# శ్రీ సరస్వతీ దేవిఅవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చిన శ్రీ అంకమ్మ తల్లి



**కందుకూరు, కలంకౌంటర్ :** కందుకూరు గ్రామదేవత ఆదిపరాశక్తి శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రులు ఆలయ ఈవో పి కార్తీక్ ఆధ్వర్యంలో ఎంత వైభవంగా నిర్వహిస్తున్నారు. నఆరవ రోజు మూలా నక్షత్రం సందర్భంగా శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారు భక్తులకు శ్రీ సరస్వతీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం నిర్వహి ంచి, కన్నుల పండుగగా అలంకరించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉభయ దాతలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.

# ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తే చర్యలు-- సీఐ జగదీష్





**కందుకూరు,కలంకౌంటర్ :** ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని కందుకూరి సిఐ జగదీష్ హెచ్చరించారు. తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వ్యాపారస్తులు రోడ్డు మార్జిన్ కు అవతలే పెట్టుకుని వ్యాపారం చేసుకోవాలని, ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా సహకరించాలని సీఐ సూచించారు. అలాకాకుండా రోడ్డు మీద బండ్లు పెట్టి ట్రాఫిక్కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా వాహనదారులు, ఆటో వారు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలిగించకుండా, సహకరించాలని కోరారు.

# ఐ వి ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా శిద్దా సుధీర్ కుమార్ జన్మదిన వేడుకలు





**చీమకుర్తి,కలంకౌంటర్ :** ప్రకాశం జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో చీమకుర్తి హరిహర క్షేత్రం నందు శుక్రవారం మాజీ మంత్రివర్యులు శిద్దా రాఘవరావు తనయుడు శిద్దా సుధీర్ కుమార్ జన్మదిన వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించారు. జిల్లా రాష్ట్ర ఐ వి ఎఫ్ నాయకులు భారీ కేకు కోసి, ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి సుధీర్ కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ మంత్రివర్యులు శిద్దా రాఘవరావు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఐవిఎఫ్ అధ్యక్షులు మురారిశెట్టి సుధీర్ కుమార్, ఐవిఎఫ్ రాష్ట్ర గౌరవ సలహాదారులు జలదంకి వెంకటకృష్ణారావు, వాసవి సేవాదళ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు పెనుగొండ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బైసాని వెంకట సుబ్బారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చీరెళ్ళ వేణుగోపాలరావు, ఐవిఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తటవర్తి శివన్నారాయణ, కందుకూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త మానేపల్లి బుచ్చయ్య గుప్తా, ఆర్యవైశ్య నాయకులు కోటా కిషోర్ బాబు,ఇన్నమూరి శ్రీనివాసులు, మురారిశెట్టి వెంకటేష్, కంకణాల వెంకటేశ్వర్లు, వేముల రాము, మద్దాళి బాలాజీ, చీదెండ్ల కృష్ణ, వేమూరి సుధాకర్, దేసు వెంకటేశ్వర్లు తదితర ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

# కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలు



సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన పార్వతీదేవి

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా ఆరవ రోజు శుక్రవారం నగరేశ్వర స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పార్వతీదేవి, కన్యకా పరమేశ్వరి అమ్మవార్లకు కుంకుమార్చనలు జరిగాయి. ఉదయం చదువుల తల్లి సరస్వతీదేవి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం సందర్భంగా నిర్వహించిన సరస్వతీ పూజ కార్యక్రమంలో సుమారు 4000 మంది విద్యార్థులు పాల్గొన్నారు విద్యార్థులకు పూజా ద్రవ్యాలు నోటు పుస్తకములు పెన్నులు పంపిణీ చేశారు జరిగింది. రాత్రి హైదరాబాద్ కు చెందిన పేరిణి శ్రీనివాస్ బృందం ప్రదర్శించిన పేరిణి నృత్యంశాలు ఆకట్టుకున్నాయి. శ్రీ పార్వతి దేవిని శ్రీ సరస్వతి దేవిగా, కన్యకా పరమేశ్వరి దేవిని విద్యా లక్ష్మిదేవిగా అలంకరించారు. ఆలయ పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు మామిడి మురళీకృష్ణ, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, సామా వెంకటలక్ష్మి కాంతారావు, ఉడత్తు శ్రీనివాసరావు, బైసాని హయగ్రీవ రావు అన్ని ఏర్పాట్లు చేశారు.



విద్యాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చిన కన్యకా పరమేశ్వరి దేవి





# మార్కాపురం మున్సిపల్ బరిలో హేమా హేమీలు

- టిడిపి నుండి వక్కలగడ్డ మల్లికార్జున దాదాపుగా ఖరారు
- వైఎస్సార్ సీపీ నుండి డా.కనకదుర్గ



టిడిపి అభ్యర్థిగా వక్కలగడ్డ మల్లికార్జున్....



వైఎస్సార్ సిపి అభ్యర్థిగా డాక్టర్ కనకదుర్గను ప్రకటిస్తున్న మాజీ శాసనసభ్యులు అన్నా రాంబాబు...

(ఎస్ వి కృష్ణారావు,కలం కౌంటర్ పొలిటికల్ డెస్క్)

మార్కాపురం మున్సిపాలిటీ చైర్మన్ బరిలో హేమా హేమీలు రంగంలోకి దిగి ఎన్నికలు నువ్వా నేనా అన్నట్లు జరుగనున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. టిడిపి తరుపున బలమైన నేత, ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన వక్కలగడ్డ మల్లికార్జున్ చైర్మన్ అభ్యర్థిగా దాదాపు ఖరారైనట్టు తెలుస్తోంది. వక్కలగడ్డ ఆర్థికంగా బలమైన వ్యక్తి కావడంతో ఆయనను ఢీకొట్టాలంటే వైఎస్సార్ సీపీ నుండి అంతే బలమైన అభ్యర్థిని బరిలోకి దింపేందుకు వ్యూహం రచించారు. వైసీపీ చైర్మన్ అభ్యర్థి ఎంపికలో సామాజిక , ఆర్థిక, రాజకీయ అనుభవం పరిగణలోకి తీసుకొని పలువురు నాయకులపై శోధనయి జరిగింది. మార్కాపురం మాజీ కౌన్సిలర్ సలీం పేరు మొదట పరిశీలనలోకి వచ్చింది. ఈ క్రమంలోనే మరో ఇద్దరు పేర్లు ప్రముఖంగా వినిపించాయి. ఎట్టకేలకు వైఎస్సార్ సీపీ నాయకురాలు డా. చెప్పలి కనకదుర్గ ను ఎంపిక చేశారు . మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్చార్జి అన్నా రాంబాబు మార్కాపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ కనకదుర్గను ప్రకటించారు.

# నామినేషన్ల స్వీకరణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మచిలీపట్నం నగరంలోని పలు డివిజన్ల పరిధిలో స్వర్ణ వార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను, నామినేషన్ల స్వీకరణ తీరును పరిశీలించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన దరఖాస్తు ఫారాలు, చెక్‌లిస్టులు, డిజిటల్ గడియారం ఏర్పాటు, ఇతర సామగ్రి అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించారు. నామినేషన్ పత్రాల్లో అభ్యర్థులు పొందుపరిచిన వివరాలు, సంతకాలు, జతచేయాల్సిన ధ్రువపత్రాలు, డిపాజిట్ చెల్లింపు తదితర అంశాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసి నామినేషన్లను స్వీకరించాలని సూచించారు. స్వీకరించిన ప్రతి నామినేషన్‌కు సంబంధించిన వివరాలను ఎలక్టోరల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అదే రోజు నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొత్తాన్ని తప్పనిసరిగా వీడియో చిత్రీకరణ చేయాలని, నామినేషన్ల స్వీకరణకు ఎన్నికల సంఘం నిర్దేశించిన సమయాన్ని కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నామినేషన్ల స్వీకరణలో ఏవైనా లోపాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.





స్థానిక గాంధీ బొమ్మ శివాలయం సెంటర్ లో వున్న మహిషసుర మర్దనీ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానం లో దసరా నవరాత్రులు సందర్బంగా పూజా కార్యక్రమం లో పాల్గొన్న యండూరి సురేష్ దంపతులు.

–మచిలీపట్నం,కలంకౌంటర్ :

# జీవితంలో మరపురాని ఆధ్యాత్మిక అనుభూతి

## –మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య





**హిందూపూర్,కలంకౌంటర్ :** పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం వారి ఆహ్వానం మేరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం నాకు ఎంతో ఆనందాన్ని, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. ఈ పవిత్రమైన సందర్భంగా ఆలయంలోని ఉప ఆలయమైన శ్రీ పాండురంగ స్వామివారి కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన 40 కిలోల రజత మండపాన్ని నా చేతుల మీదుగా ఆవిష్కరించే మహద్భాగ్యం కలగడం ఎంతో సంతోషంగా భావిస్తున్నాను. హిందూపూర్ ఆర్యవైశ్య సంఘం వారు ఎంతో భక్తిశ్రద్ధలతో తయారు చేయించిన రెండున్నర కిలోల సువర్ణ శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని నా చేతులతో స్పర్శించి, కొద్దిసేపు ఆ విగ్రహాన్ని నా చేతులపై మోసే అరుదైన, అపురూపమైన భాగ్యం కూడా కలిగింది. అమ్మవారి దివ్య స్వరూపాన్ని స్పర్శించి, ఆ పవిత్ర విగ్రహాన్ని చేతబూనిన ఆ క్షణాలు నా జీవితంలో ఎప్పటికీ మరచిపోలేని మధురానుభూతిగా నిలిచిపోతాయి. ఇది అమ్మవారి అనుగ్రహంగా, నా అదృష్టంగా భావిస్తున్నాను. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దివ్య ఆశీస్సులు, శ్రీ పాండురంగ స్వామివారి కృపాకటాక్షాలు అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ఆర్యవైశ్య సమాజం ఐకమత్యంతో, అభివృద్ధితో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య తెలిపారు.






OWNER, PUBLISHER AND EDITOR BY : CH.VASAVIDEVI, PRINTED AT : SANAM VENKATA RAJASEKAR ARUNODAYA NOTE BOOK MANUFACTURERS PVT LMT, 33-5-9, 3RD FLOOR, PAPAIAH STREET, SEETHARAMPURAM, VIJAYAWADA, KRISHNA , AP - 520002. PRGI NO. APTEL/2016/69464. CELL 9346935672.